క్లుప్తంగా

బర్రంకుల ఉరువులమ్మకు పాల పొంగళ్ల సమర్పణ



గణపేశ్వరం(నాగాయలంక): గణపేశ్వరం శివారు బర్రంకుల గ్రామంలోని ఉరువులమ్మ తల్లి జాతర మహోత్సవం శనివారం ప్రారంభమైంది. అమ్మవారికి గ్రామంలో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాలపొంగళ్లు సమర్పించారు. ఆదివారం ఉదయం నుంచి గుడి సంబరం ప్రారంభమవుతుందని, భక్తులు, గ్రామస్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకుంటారని, అనంతరం అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

స్వామివారి సేవలో పేర్ని నాని దంపతులు



మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసి నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

వైభవంగా ఆంజనేయుడి ఆలయ వార్షికోత్సవం



కోడూరు: లింగారెడ్డిపాలెం శివారు నక్కవానిదారి గ్రామంలో అభయాంజనేయ స్వామి వారి ఆలయ ప్రథమ వార్షిక ప్రతిష్ఠ ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం తులసీదళాలు, వివిధ రకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు. గారెలు, వడలు, అప్పాలతో మాలలు తయారు చేసి స్వామివారికి అలంకరించారు. గ్రామంలోని భక్తబృందాలచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామేశ్వరునికి వసంతోత్సవం



టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లి గ్రామంలోని బాల పార్వతి సమేత రామేశ్వర స్వామి వారికి శనివారం వసంతోత్సవం నిర్వహించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేక వాహనంపై రథోత్సవం నిర్వహించారు.

నేడు వలంటీర్లకు పురస్కారాలు

అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం 9 గంటలకు మండల వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తామని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. మండలంలోని వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్లు మచిలీపట్నం టౌన్ కొత్తపేట కాపుర స్తులు గంపల సూర్యనారాయణ గారి కుమార్తె సత్యనారాయణ వీరి సోదరుడు రామకృష్ణ గార్ల సంజాయిషీ ఏమనగా...

నా క్లయింట్లు యీ దిగువ షెడ్యూలు ఆస్తిని కృష్ణాజిల్లా, మచిలీపట్నం టౌన్, జవ్వారుపేట కాపురస్తులు కూనపరెడ్డి (లేటు) వీరరాఘవేంద్రరావు గారి భార్య 1) సూర్యకుమారి, వీరి కుమారుడు 2) లక్ష్మయ్య మరియు వీరి కుమార్తె 3) యర్రా పద్మావతి గార్ల వద్ద నుండి క్రయం పొందు నిమిత్తమై ఎగ్రిమెంటు పొందియున్నారు. సదరు యీ దిగువ ఆస్తిని 1వ వారి భర్తగారు, 2, 3 వారల తండ్రి గారు అయిన వీరరాఘవేంద్రరావు గార్కి వీరి దత్తత తండ్రిగారైన వీరరాఘవయ్య నాయుడు గారి వద్ద నుండి సంక్రమించినది. అట్టి ఆస్తిని సదరు వీరరాఘవయ్య నాయుడు గార్కి ది. 24-05-1948న రిజిష్టర్ క్రయ డి.నెం. 1550/1948 రు గా సంక్రమించిన దర్మిలా సదరు వీర రాఘవయ్య నాయుడు వీరి దత్తత కుమారుడు వీరరాఘవేంద్రరావు గారు ఇంటెస్టేట్‌గా మరణించినారు. కావున అట్టి ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన వారసత్వపు హక్కులు గానీ, జప్తులు, తనఖాలు, ఛార్జీలు, క్రయములు, ఎగ్రిమెంట్లు, కోర్టు వివాదాలు వున్నయెడల నేటి నుండి 10 రోజులలోపు వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలు పరిగణలోకి తీసికొనబడవు.

షెడ్యూలు: కృష్ణాజిల్లా, మచిలీపట్నం స॥ది॥ వారి యిలాకా మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జగన్నాథపురంలో పున్నటుపంటిస్, మున్సిపల్ వార్డు-25, డోర్ నెం. 25/226కు చెందిన చ॥గ॥ 541లు లో చ॥గ॥300లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : మున్సిపల్ రోడ్డు, **దక్షిణం** : మేకల వీరవెంకట కుమార్ బాబు గారి ఆస్తి, **పడమర** : మేకల వీరవెంకట కుమార్ బాబు గారి ఆస్తి కొంత, మాతాలూకు ఆస్తి కొంత, **ఉత్తరం** : నాయుడు కాశీవిశ్వేశ్వరరావు గారి ఆస్తి. యీ హద్దుల మధ్య చ॥గ॥ 300లు ఖాళీ

గొడుగుపేట, మచిలీపట్నం, ది. 20-5-23 — **పసుమర్తి సూర్యప్రకాష్**, అడ్వకేట్, సెల్ : 98661 27503

తొలగనున్న ముురుగు ముప్పు

- వర్షాకాలంలో ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు
- డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: రానున్న వర్షాకాలంలో ముంపు సమస్యను పరిష్కరించే దిశగా నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలోని ప్రధాన డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టును తొలగించే పనులకు ఉపక్రమించారు. నగరంలోని పలు డివిజన్లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో గ్యాంగ్‌వర్క్ పనులు చేపట్టారు. ప్రధాన డ్రెయిన్లయిన ఈడేపల్లి, సబ్‌జైల్, ఫత్తుల్లాబాద్, ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రెయిన్లలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన సిల్టును తొలగిస్తున్నారు. ఇటీవల కొద్ది రోజులుగా ఈ పనులను పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్నారు. ఈ డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టును పారలు, బకెట్ల సాయంతో డ్రెయిన్ల పక్కకు వెల్లవేస్తున్నారు. ఈ వ్యర్థాలు ఎండిన అనంతరం ట్రాక్టర్లలో బయటికి తరలిస్తున్నారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టును ఈ వేసవిలోనే తొలగిస్తుండటంతో వచ్చే వర్షాకాలంలో భారీవర్షాలు కురిసినా నీరు ఎప్పటికప్పుడే పారుదలయ్యే సదుపాయం కలుగుతుంది. దీంతో రహదారులపై వర్షం నీరు నిలిచే అవకాశం తగ్గుతుంది. ఒకవేళ నిలిచినా కొద్ది గంటల్లోనే డ్రెయిన్ల ద్వారా త్వరితగతిన పారేందుకు ఈ సిల్టుతీత పనులు ఉపకరిస్తాయి. ఆయా డివిజన్లలో ఉన్న శానిటరీ మేస్త్రీలు, హెల్త్ సెక్రటరీ కార్మికులతో దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.



ఈడేపల్లి డ్రెయిన్‌లో సిల్ట్ తొలగిస్తున్న కార్మికులు

కాలువ క్లీనింగ్ పనులు ప్రారంభం

మోపిదేవి: మోపిదేవి దళితవాడ సమీపంలో 11వ నెంబర్ కాలువ క్లీనింగ్ పనులను సర్పంచ్ నందిగం మేరీరాణి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ కాలువలో చెత్తాచెదారం, గుర్రపుడెక్క తొలగించి శుభ్రం చేస్తున్నారని చెప్పారు. గ్రామస్తులు పరిశుభ్రత పాటించాలని, కాలువల్లో చెత్తాచెదారం వేయరాదని చెప్పారు. ఈఓపీఆర్డీ అరుణకుమారి, గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి, పంచాయతీ వార్డు సభ్యులు కేశగాని రాంబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పోర్టు నిర్మాణంతో యువతకు ఉపాధి

పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: బందరు పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. తపసిపూడి గ్రామంలో పోర్టు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలను విలేకర్ల బృందంతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ స్థానికంగా ఉంటూ ఉద్యోగాలు చేసుకోవాలని, తల్లిదండ్రుల వద్ద ఉండాలని చాలా మంది యువకులు భావిస్తారని చెప్పారు. పోర్టు నిర్మాణంతో పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. బందరు ప్రజలకు మూడు మేజర్ ప్రాజెక్టులైన పోర్టు నిర్మాణం, మెడికల్ కళాశాల, హార్బర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బందరు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పోర్టు పనుల ప్రారంభోత్సవం, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిటికిన నాగేశ్వరరావు, బడే భానుతేజ, మరీదు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పోర్టు నిర్మాణానికి సంబంధించి పూజా కార్యక్రమాలు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పేర్ని కిట్టు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గూడూరు తహసీల్దార్ విజయప్రసాద్

గూడూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక హక్కులు కల్పించాయని, వాటిని సద్వినియోగం చేసుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ ఆకాంక్షించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానవ హక్కులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, సమాచార హక్కు చట్టాలపై అవగాహన సదస్సు గూడూరులోని వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథి తహసీల్దార్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కూడా రిజర్వేషన్లు కల్పించి మహిళలను ప్రభుత్వాలు ప్రోత్సాహిస్తున్నాయన్నారు. అయినప్పటికీ సమాజంలో మహిళలు ఇంకా వెనుకబడే ఉన్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవాడ ప్రశాంతి, జిల్లా అధ్యక్షురాలు కె.సాయి, హెడ్ కానిస్టేబుల్ వై.చిట్టిబాబు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, సీసీలు అమ్మాజీ, సంతోషరేఖ, శ్రీనివాస్, డ్వాక్రా మహిళలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

గూడూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గూడూరులోని శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. లూడో, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు తెలిపారు. పోటీలలో సీహెచ్ కార్తీక్ (చెస్), జె.తేజ (లూడో), యశ్వంత్ (క్యారమ్స్) విజేతలుగా నిలిచారని చెప్పారు. విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానం చేస్తామన్నారు.



గూడూరులో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి కొడాలి, ఘంటసాల గ్రంథాలయాల్లో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం, సృజనాత్మకత, కథలు చెప్పడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తక పఠనం, బొమ్మలు వేయడం నేర్పించారు. స్కిప్పింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కొడాలి, ఘంటసాల గ్రంథాలయ అధికారులు ఎం. సుబ్బారావు, ఎం. శరత్‌కుమార్ పర్యవేక్షించారు.



కొడాలిలో తాము వేసిన బొమ్మలను చూపుతున్న చిన్నారులు

విద్యార్థులకు ప్రశంసా పత్రాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరంలో పలు అంశాలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో హనుమాన్ చాలీసా పఠించిన విద్యార్థులకు ఉపాధ్యాయిని లక్ష్మీకాంతం ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు చిలకలపూడి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా, ధ్యానం, శ్లోక పఠనం నేర్పించారు. చిత్రలేఖనం, గణితం, క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. దేశభక్తి గీతాలు ఆలపించి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.



ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కృష్ణానదిలో యల్లారమ్మ ఘటాలకు శుద్ధి

నాగాయలంక: స్థానిక సబ్బినేని బజారులోని సబ్బినేని వారి కులదేవత యల్లారమ్మ అమ్మవారి జాతర శనివారం ప్రారంభమైంది. గ్రామస్తుల నేతృత్వంలో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా నాగాయలంకలోని కృష్ణానదికి తీసుకువెళ్లి శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లో పుణ్యస్నానాలు చేయించారు. అనంతరం గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని జల్దిలో ఉంచారు. జల్ది నుంచి తరలించి గ్రామోత్సవం నిర్వహించారు. ఘటాలు గుడికి చేరుకున్నాక ఆదివారం జాతర సంప్రదాయాల ప్రకారం సంబరం జరుపుతామని, భక్తులు చద్దినైవేద్యాల సమర్పణతో మొక్కుబడులు తీర్చుకుంటారని, అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధి సబ్బినేని భుజంగరావు చెప్పారు.



శుద్ధిపూజల అనంతరం జల్దికి తరలిస్తున్న ఘటాలు

గ్రామ కార్యదర్శి తీరుపై సభ్యుల ఆగ్రహం

మోపిదేవి: అధికారులపై ఆగ్రహంతో టీడీపీ వర్గీయులు బాయ్‌కాట్ చేసి వెళ్లిపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రావి దుర్గావాణి వాయిదా వేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ దుర్గావాణి అధ్యక్షతన నిర్వహించారు. కె. కొత్తపాలెం సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి సర్పంచ్‌ను కలుపుకుపోవడం లేదని, తద్వారా అభివృద్ధి కుంటుపడుతోందని ఆరోపించారు. కార్యదర్శిని బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ పోడియం వద్ద బైటాయించారు. టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆమెకు బాసటగా కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు. త్వరలో బదిలీల ప్రక్రియ చేపట్టనున్నందున సమస్య పరిష్కారం అవుతుందని, సభకు సహకరించాలని కోరారు. తాము సభను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి టీడీపీ సభ్యులు బయటకు వెళ్లిపోవడంతో సభను వాయిదా వేశారు.

వైఎస్సార్ జలకళతో రైతులకు ప్రయోజనం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటిని అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ జలకళ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామ పరిధిలోని తాతినేని రామ్మోహన్‌రావు పంట పొలాల్లో జలకళ బోరు ఏర్పాటు పనులకు శనివారం ఎమ్మెల్యే కైలే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజరు, బీడు భూముల్లో నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జలకళ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సాగునీటికి అవకాశం లేని చోట సన్న చిన్నకారు రైతులకు సాగుకు నీరు అందించేందుకు పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. సాగుకు నీరు లేక ఏ ఒక్క రైతు ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించి అమలు చేస్తోందన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా రైతులకు జలకళ అందిస్తున్నామని చెప్పారు. బోర్లు వేయడంతో పాటు సబ్ మెర్సిబుల్ మోటర్లను సైతం ప్రభుత్వమే అందిస్తోందన్నారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

రైతుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కైలే అన్నారు. దీని కోసం రైతులకు రైతు భరోసా, వైఎస్సార్ జలకళ ద్వారా బోర్ల ఏర్పాటు తదితరాలను అందిస్తోందన్నారు. రైతులు దరఖాస్తులు చేసుకుంటే వారి ప్రదేశాలను అధికారులు పరిశీలన చేసి ఎక్కడ సాగునీరు బోరు పడుతుందో రైతులకు స్పష్టం చేస్తారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ జలకళ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంభపు రాంబాబు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు యలమంచిలి గణేష్, మారపాక మహేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భూమి సారవంతంపై అవగాహన

మోపిదేవి: భూమి సారవంతంపై మోపిదేవి ఆర్బీకేలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్ యూనిట్ ఇన్‌చార్జి పి. నరసింహారావు మాట్లాడుతూ జనుము, జీలుగ, చిరుధాన్యాలను కలిపి చల్లుకోవాలన్నారు. దీని వల్ల భూమి జీవ వైవిధ్యం పెరుగుతుందని, ఒక్కో మొక్క నుంచి ఒక్కో పోషకం భూమికి అందడం వల్ల భూమి సారవంతం అవుతుందని వివరించారు. ఐసీఆర్పీ తోట సురేష్, ఎస్. బాబూరావు, వి. చిన్నపాప, వీఏఏ కరుణ పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారునికి పక్కా ఇల్లు

కృత్తివెన్ను: అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి ఇంటి స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం వారు హౌసింగ్ ఏఈతో కలిసి యండపల్లి పంచాయతీలోని జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులతో వారు మాట్లాడి వెంటనే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

భూ హక్కు సర్వేకు ప్రజలు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ

గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీసర్వే పనులకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ కోరారు. జగనన్న భూ రీసర్వే కార్యక్రమాన్ని శనివారం పట్టణంలో మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏళ్ల తరబడి పరిష్కారం కానీ విధంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాలను ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్న రీసర్వే కార్యక్రమంలో గుడివాడ పట్టణంలో ప్రారంభించామని చెప్పారు. సర్వేలో భాగంగా జీసీపీ, సీపీ పాయింట్స్ మార్క్ చేసి రోవర్స్, డ్రోన్లపై సర్వే జరుగుతుందన్నారు. పురపాలక సంఘ పరిధి 12.67 చదరపు కిలో మీటర్లు ఉండగా అందులో విలీనమైన 6 గ్రామ పంచాయతీలతో కలసి 50 చదరపు కిలో మీటర్లుగా ఉన్న విస్తీర్ణంలో పట్టణ ప్రణాళిక విభాగంతో సర్వే నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. సర్వేకు పట్టణ ప్రజలు సహకరించి శాశ్వత భూ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

సజ్జలను కలిసిన దిల్‌షాద్ నజరానా

చల్లపల్లి: రాష్ట్ర ఉర్దూ అకాడమీ పాలక మండలి నూతన సభ్యురాలిగా నియమితురాలైన అవనిగడ్డ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు షేక్ దిల్‌షాద్ నజరానా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనపై విశ్వాసంతో పదవీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సజ్జల రామకృష్ణారెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. అంకితభావంతో పనిచేసి మంచి పేరు తేవాలని సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు.



సజ్జల రామకృష్ణారెడ్డితో దిల్‌షాద్ నజరానా

పోలియో నిర్మూలన ఫండ్‌కు విద్యార్థుల ఆర్థిక సాయం

గుడివాడరూరల్: విద్యార్థి దశ నుంచే ఎదుటివారికి సాయపడాలనే సేవా దృక్పథం కలిగి ఉండాలని రోటరీ క్లబ్ కౌన్సిలర్ గవిర్నేని బాబూశ్రీకర్ తెలిపారు. పట్టణంలోని రోటరీ పోలియో నిర్మూలన ఫండ్‌కు విద్యాలయ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు దాతృత్వంతో సేకరించిన రూ.75,116 చెక్కును స్థానిక జీవీ పూర్ణచంద్రరావు ఆడిటోరియంలో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యాలయ సంస్థ డైరెక్టర్ బొప్పన వెంకట విజయభాస్కర్ రోటరీక్లబ్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యాలయ విద్యార్థులు స్వచ్ఛంద సంస్థల పిలుపు మేరకు గతంలో అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఎదుటివారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతో విద్యార్థులు ముందంజలో ఉన్నారన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు విద్యాలయ ద్వారా నిర్వహిస్తామని చెప్పారు.

పోలియో నివారణకు రోటరీ క్లబ్ విశేష కృషి

రోటరీ క్లబ్ కౌన్సిలర్ గవిర్నేని బాబూశ్రీకర్‌బాబు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలకు దాతలు, శ్రేయోభిలాషులు, విద్యార్థులు సహకరించడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుంచే ఎదుటి వారిని ఆదుకోవాలన్న ఆలోచన రావడం గొప్ప విషయమని చెప్పారు. పోలియో నివారణకు రోటరీ క్లబ్ విశేషంగా కృషి చేస్తుందన్నారు. పోలియో నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు ముళ్లపూడి రమణమూర్తి, కార్యదర్శి గండు నరేష్, రోటరీ పోలియో ప్రాజెక్టు చైర్మన్ రావి శ్రీహర్షచౌదరి, అసిస్టెంట్ గవర్నర్ యలమంచిలి రెడ్డయ్యచౌదరి, యూత్ ఎఫైర్స్ తుమ్మల శ్రీనివాస్‌చౌదరి, మూడెడ్ల శ్రీధర్, ఇర్మియా, విద్యాలయ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోటరీ క్లబ్ సభ్యులకు చెక్కు అందజేస్తున్న విద్యాలయ సంస్థ ప్రతినిధులు

రహదారులు నిర్మానుష్యం

నాగాయలంక: భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. వేసవి ఎండల తీవ్రతకు వడగాడ్పులు తోడవడం, ఉక్కపోతతో ఇంట్లో ఉండలేక.. బయటకు రాలేక ప్రజలు విలవిలలాడుతున్నారు. ఉదయం ఏడు గంటలకే ఎండ మండుతోంది. ముఖ్యమైన పనులు ఉంటే తప్ప బయటకు రాలేని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్లు సైతం ఉదయం 10 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. మజ్జిగ, శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది.



నాగాయలంకలో నిర్మానుష్యంగా మారిన మెయిన్ రోడ్డు

మోదుమూడిలో అన్నసమారాధన

మోదుమూడి(అవనిగడ్డ): మోదుమూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం అన్నసమారాధన నిర్వహించారు. అర్చకులు దివి పార్థసారథి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త శిర్విశెట్టి రాజేశ్వరరావు పర్యవేక్షించారు.



అన్నసమారాధన చేస్తున్న భక్తులు

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి

భావదేవరపల్లి(నాగాయలంక): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ)ను సద్వినియోగం చేసుకోవాలని 104 బందరు డివిజన్ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస పెరుమాళ్లు అన్నారు. భావదేవరపల్లిలో శనివారం జరిగిన పీఎఫ్, 104 సంచార వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. నాగాయలంక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇంద్రకుమార్‌రెడ్డి వైద్య సేవలు అందించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ సేవలు గ్రామీణులకు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. సీహెచ్ఓ ఎస్.శివయ్య, హెచ్‌వి ఎల్.రత్నకుమారి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలు, కృష్ణాజిల్లా

టెండరు ప్రకటన

2023-24 ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా 4 గురుకుల విద్యాలయాలకు ఈ క్రింది విధంగా సీల్డ్ టెండర్లు కోరడమైనది. కూరగాయలు, నిత్యావసర సరుకులు (విజయకృష్ణ, KDCMS వారు మాత్రమే) పాలు (8.5 SNF టోన్డ్ మిల్క్ మాత్రమే) పండ్లు, కోడిగుడ్లు, స్కిన్‌లెస్ చికెన్, బార్బర్ టెండర్ వేయువారు సంబంధిత విద్యా సంస్థలలో నిమ్మకూరు స్కూల్ మరియు కాలేజీ, పులిగడ్డ మచిలీపట్నంలో టెండర్ ఫారమ్స్ అమ్మబడును.

టెండర్ ఫారమ్స్ అమ్మకం ప్రారంభం : 20-05-2023 నుండి 26-05-2023 (ఉదయం 10-30 నుండి సాయంత్రం 5-00 గం॥ వరకు) పూర్తిచేసిన టెండర్స్ 27-05-2023 సంబంధిత విద్యాసంస్థలలో సాయంత్రం 4-30 కల్లా అందజేయగలరు. **టెండర్ నిర్ధారిత తేదీ :** 29-05-2023 సోమవారం సా॥ 4-00 కల్లా మచిలీపట్నంలో జె.సి. ఛాంబర్ లో జరుగును. ఏకారణం చేతనైనా టెండర్ వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు జిల్లా కొనుగోలు కమిటీ ఛైర్మన్ వారికి పూర్తి హక్కు కలదు. ఫోన్ : 98665 59630

ప్రిన్సిపాల్ కన్వీనర్, నిమ్మకూరు